# నిజామాబాద్‌ను అద్భుతంగా తీర్చిదిద్దాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

- అభద్రతాభావంతో రైతుబంధు సాయాన్ని నిలిపి వేయించిన హస్తం పార్టీ
- రైతు వ్యతిరేకి కాంగ్రెస్‌కు రైతన్నలు బుద్ధి చెప్పాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 27 : నిజామాబాద్‌లో ఉన్నామా లేదా హైదరాబాద్‌లో ఉన్నామా అనుకునేంత స్థాయిలో నిజామాబాద్‌ను అభివృద్ధి చేసి, అద్భుతంగా తీర్చిదిద్దామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు, ప్రతి గల్లీకి సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతోపాటు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తాతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ పార్టీ వెంటబడి మరీ నిలిపి వేయించిందని, రైతుల నోటి కాడి బుక్కను లాక్కొని మరోసారి ఆ పార్టీ రైతు వ్యతిరేకతను చాటుకున్నదని అన్నారు. రైతుబంధు ఇప్పటికే అమలులో ఉన్న పథకమని, 10 సార్లు రైతుబంధు పథకం కింద రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు జమ చేసిందని తెలిపారు. రైతుబంధు పథకం ఎన్నికల మ్యానిఫెస్టోలో లేకుండా సీఎం కేసీఆర్ అమలుచేశారని గుర్తుచేశారు. రైతు వ్యతిరేక వైఖరిని కాంగ్రెస్ పార్టీ మరోసారి రుజువు చేసుకున్నదని అన్నారు. ఆ పార్టీకి రైతులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

**‘మిడతల దండు’ పని పట్టాలి**

ఐదారు రోజులుగా ప్రధాని మోదీతోపాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, కాంగ్రెస్ అగ్రనాయకులు ప్రచారం చేస్తున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో మిడతల దండులాగా తెలంగాణ మీద పడడానికి వస్తున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన నాడు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు. మానవీయ కోణంతో ఆలోచించే సీఎం కేసీఆర్‌పై అభాండాలు వేస్తూ, పిచ్చిపిచ్చి ఆరోపణలు చేస్తున్న మిడతల దండు పనిపట్టాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టంచేశారు.

**బుల్డోజర్లు కాదు..**
**ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలి**

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వచ్చి తెలంగాణలో బుల్డోజర్ నడపాల్సిన సమయం ఆసన్నమైందని అంటున్నారని, వెయ్యి బుల్డోజర్లు నడిపినా వాటిపై దాడి చేయడానికి కారు సిద్ధంగా ఉందన్నారు. ‘బుల్డోజర్లు నడపడం మా ఆలోచన కాదు, పొలాల్లో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడవాలన్నదే మా ఆలోచన. సాగు, తాగునీళ్లు అందించాలని, పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని, మీలాగా ఇండ్లను కూల్చివేయడం కాకుండా ఇండ్లు నిర్మించడమే మా ఆలోచన’ అని వ్యాఖ్యానించారు. ఉపాధిహామీ కార్మికులకు సగటున రోజుకు రూ.150 వేతనం కూడా రావడం లేదని, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ ఎందుకు ప్రశ్నించడం లేదని ప్రశ్నించారు. సింగరేణిని ప్రైవేటీకరించడానికి సీఎం కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ప్రియాంకా గాంధీ ఆరోపించారని, ఆమె మాటలు వింటే నవ్వాలో, ఏడవాలో అర్థం కానీ పరిస్థితి నెలకొన్నదన్నారు. తాడిచెటర్ల బొగ్గ గనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందే కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. సింగరేణిని కూడా ఎంతో అభివృద్ధి చేశామని, సుమారు 25 వేల మందికి డిపెంటెంట్ ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తెలంగాణలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని తెలిపారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలకు బీజేపీ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం లేదని, వీటిని ఎందుకు భర్తీ చేయడం లేదని బీజేపీ నాయకులను యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

# రైతుబంధు కావాల్నా.. రాబందులు కావాల్నా?

- కాంగ్రెస్ పార్టీది ఓట్లు దండుకునే విధానం
- సాధ్యం కాని హామీలతో మభ్యపెట్టే యత్నం
- ‘బోధన్’ ప్రచారంలో ఎమ్మెల్సీ కవిత ధ్వజం



అమ్దాపూర్‌లో ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌ను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

బోధన్/శక్కర్‌నగర్/ బోధన్‌రూరల్/రెంజల్, నవంబర్ 27: బోధన్, నవంబర్ 27 : సీఎం కేసీఆర్ అమలుచేసిన రైతుబంధు కావాల్నా లేక రాబందులు కావాల్నా అని ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించారు. తెలంగాణా కన్నా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఒక్క ఉద్యోగం ఎక్కువ ఇచ్చినట్లయితే తాము ప్రజల్ని ఓట్లు అడగగమని, తెలంగాణ కన్నా ఎక్కువ ఉద్యోగాలు ఏదైనా రాష్ట్రంలో వచ్చినట్లు రుజువుచేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమా అని ఎమ్మెల్సీ కవిత సవాల్ చేశారు. బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్, రెంజల్ బేస్, షఫీ చమాన్, అంబేద్కర్ కాలనీ ప్రాంతాలతోపాటు బోధన్ మండలంలోని బెల్లాల్, అమ్దాపూర్, ఊట్‌పల్లి, భవానీపేట్, సంగం, మీనార్‌పల్లి, సాలూరా మండలకేంద్రంతోపాటు హున్సా, సాలంపాడ్, రెంజల్‌లో ప్రచారం నిర్వహించారు.

బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హైదరాబాద్‌కు 22 వేల బహుళజాతి కంపెనీలను తీసుకువచ్చామని, దాదాపు 32 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ప్రభుత్వరంగంలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీచేశామని, అందులో 1.6 లక్షల మంది ఇప్పటికే ఉద్యోగాల్లో చేరారని వివరించారు. అభివృద్ధిలో దూసుకెళ్తున్న అడ్డుకునే శక్తులకు ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేదని, సకాలంలో ఎరువులను సరఫరాచేయలేదని, వడ్లు కొనుగోలు చేయలేదని ఎత్తిచూపించారు. పొరపాటునో, గ్రహపాటునో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జైభీమ్ అవుతుందని ఎద్దేవా చేశారు. బీడీ కార్మికులతో సహా అన్నిరకాల పింఛన్లను రూ.5 వేలకు పెంచాలని, కటాఫ్ డేట్‌తో సంబంధంలేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు ఇవ్వాలని, పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం పేరిట నెలకు రూ.3 వేలు పింఛన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే రేషన్ కార్డులను సరిదిద్ది, కొత్తరేషన్ కార్డులు జారీచేసిన తర్వాత రైతుబీమా తరహాలో పేదలకు రూ.5 లక్షల మేరకు ‘కేసీఆర్ రక్ష’ పేరిట కొత్తగా బీమా పథకం అమలుచేస్తామని, రూ.15 లక్షల మేరకు ప్రైవేట్ ఆస్పత్రులో వైద్య చికిత్సలు చేయించుకునే సౌకర్యం కల్పించాలని సీఎం కేసీఆర్ తలపెట్టారన్నారు. సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే, రైతుబంధు మొత్తం రూ.16 వేలకు పెరుగుతుందని, ఎన్నికల తర్వాత రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీచేస్తామన్నారు. గ్యాస్ సిలిండర్ రూ.400కు ఇస్తామన్నారు. స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షలు ఇస్తామని తెలిపారు. రానున్న ఐదేండ్లలో పెద్ద సంఖ్యలో ఇండ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. బోధన్‌లో నిజాంషుగర్స్ భూములకు పట్టాలు చెప్పారు. మంచి మనిషి, బోధన్ నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే షకీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు.

**మళ్లీ ఆశీర్వదించండి : మహ్మద్ షకీల్**

బోధన్ నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశామని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని అందించామని బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అన్నారు. ఎమ్మెల్సీ కవితతో కలిసి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చేందుకు తనను మళ్లీ ఆశీర్వదించి, భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.



ఊట్‌పల్లిలో ప్రచారానికి హాజరైన ప్రజలు

# ఎన్నికల నేపథ్యంలో భారీ బందోబస్తు

- 1,423 బూత్‌ల వద్ద ప్రత్యేక నిఘా
- 5 వేల మంది సిబ్బందితో భద్రతా చర్యలు
- జిల్లాలో ఆరు రోజుల పాటు 144 సెక్షన్ అమలు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్

నిజామాబాద్ క్రైం, నవంబర్ 27 : రాష్ట్ర శాసనసభ -2023 సార్వత్రిక ఎన్నికలు ఈ నెల 30వ తేదీన జరగనున్న నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 48 గంటల ముందు నుంచి పోలీసు యంత్రాంగం బందోబస్త్ చర్యలకు రంగం సిద్ధం చేసింది. ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. భద్రత కోసం సివిల్ పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర బలగాలను సైతం రంగంలోకి దింపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల్లో అవసరమైన బందోబస్తుపై సీపీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. 6 నియోజకవర్గాలో 1,423 పోలింగ్ బూత్‌ల వద్ద శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టారు. భద్రత కోసం 3,500 మంది పోలీసు సిబ్బందితో పాటు 1200 మంది కేంద్ర బలగాలను రంగంలోకి దింపారు. వీరితో పాటు 250 పెట్రోలింగ్ పార్టీలు, క్యూఆర్టీ, క్విక్ రియాక్షన్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్స్‌తో పాటు స్పెషల్ స్ట్రైకింగ్ టీములను ఏర్పాటు చేశారు.

**48 గంటల ముందు నుంచి ప్రచారాలకు బ్రేక్, 144 సెక్షన్ అమలు**

ఆరు నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 28 సాయంత్రం 5 నుంచి డిసెంబర్ 4వ తేదీ సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ వెల్లడించారు. రాజకీయ నాయకులు, అభ్యర్థులు సమావేశాలు, ప్రచారాలు నిర్వహించరాదని సూచించారు. లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లలో బసచేసిన ఇతర ప్రాంతాలకు చెందిన రాజకీయ నాయకులను ఈ నెల 28 సాయంత్రం 5 గంటలలోగా ఆదేశించారు. ఓటింగ్ నేపథ్యంలో ఈ నెల 28 సాయంత్రం 5 నుంచి 30 వరకు, కౌంటింగ్ నేపథ్యంలో డిసెంబర్ 3న వైన్ షాపులు, కల్లు దుకాణాలను మూసి ఉంచాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్**



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు, అధికారులు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 27 : శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపుకార్డులు, ఓటరు స్లిప్పుల పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో పోలింగ్ ప్రకియను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు.. రాష్ట ఎన్నికల ప్రధాన అధికారి దృష్టికి తీసుకెళ్లారు.

**పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయం ఈనెల 28 సాయంత్రం 5 గంటలకు ముగియనుందని, రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం అందించాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు స్వస్థలాలకు తిరిగి వెళ్లేలా చూడాలన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని అన్నారు. పోలింగ్ అనంతరం ఈవీఎం, యంత్రాల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని అన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకొని, మాక్‌పోల్ నిర్వహించాలని.. పోలింగ్ సజావుగా జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారమున్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.